# గౌడ కులస్తుల సంక్షేమానికి కృషి



గౌడ కులస్తుల సమ్మేళనంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

- గౌడ కులాన్ని బీసీబంధులో చేర్పిస్తా..
- కాంగ్రెస్ హయాంలో గౌడ కులస్తులకు అన్యాయం
- ఆత్మీయ సమ్మేళనంలో రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్‌పల్లి, నవంబర్ 2 : బీఆర్‌ఎస్ ప్రభుత్వం గౌడ కులస్తుల సంక్షేమానికి కృషిచేస్తున్నదని, సీఎం కేసీఆర్‌తో మాట్లాడి గౌడ కులాన్ని బీసీబంధు పథకంలో చేర్పించేందుకు కృషిచేస్తానని బీఆర్‌ఎస్ రూరల్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ హామీఇచ్చారు. డిచ్‌పల్లి మండలకేంద్రంలోని ఎస్ఎల్‌జీ గార్డెన్స్‌లో గౌడ కులస్తుల ఆత్మీయ సమ్మేళనాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాజిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో ఏకైక బీసీ నాయకుడిని తానేనని, తనకు అండగా ఉండి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గౌడ కులస్తులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. చెట్టు పన్ను పేరుతో గౌడ కులస్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ చెట్టు పన్నును రద్దు చేశారని తెలిపారు. ప్రస్తుతం కుల వృత్తిని ఆధారంగా చేసుకొని గౌడ కులస్తులు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని అన్నారు. ప్రజలకు కల్తీలేని కల్లును అందించడానికి ప్రభుత్వం ఈత, తాటివనాల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నదన్నారు. గతంలో గౌడ కులస్తులు తాటిచెట్టుపై నుంచి పడి మృతిచెందింతే రూ.2 లక్షలు ఇన్సూరెన్స్ ఇచ్చేవారని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం దానిని రూ.5 లక్షలకు పెంచిందని చెప్పారు. డిచ్‌పల్లిలో తెలంగాణ యూనివర్సిటీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉన్న దృష్ట్యా బీసీ హాస్టల్ నిర్మాణం కోసం రూ.కోటి నిధులు మంజూరుకు కృషిచేస్తానన్నారు. సీఎం కేసీఆర్ కొత్తగా ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టోతో రాష్ట్రంలోని 90 లక్షల మందికి రూ. 5లక్షల బీమా సౌకర్యం లభిస్తుందని తెలిపారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రూరల్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ వి.గంగాధర్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రజల కోసం నిత్యం పనిచేసే బాజిరెడ్డిగోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ధర్పల్లి జడ్పీటీసీ సభ్యుడు బాజిరెడ్డి జగన్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్, గౌడ సంఘం నాయకులు రాజాగౌడ్, సురేందర్‌గౌడ్, జయసింహాగౌడ్, శ్యాంసుందర్‌గౌడ్, ప్రసాద్‌గౌడ్, పర్శాగౌడ్, నర్సాగౌడ్, నారాగౌడ్, గంగాధర్‌గౌడ్, శేఖర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్ పాటు ఏడు మండలాల గౌడ కులస్తులు పాల్గొన్నారు.

### క్రిస్టియన్లను గత పాలకులు పట్టించుకోలేదు..

క్రిస్టియన్లను గత పాలకులు పట్టించుకోలేదని రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. డిచ్‌పల్లిలోని ఎస్ఎల్‌జీ గార్డెన్‌లో గురువారం రాత్రి రూరల్ నియోజకవర్గ క్రిస్టియన్ల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించగా.. బాజిరెడ్డి హాజరై మాట్లాడారు. స్వరాష్ట్రం వచ్చిన తర్వాత క్రిస్మస్‌ను అధికారికంగా నిర్వహించడంతోపాటు నూతన వస్త్రాలను పంపిణీ చేస్తున్నామని, చర్చిలకు భారీగా నిధులు మంజూరు చేశామని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు చెప్పే కల్లబొల్లి మాటలను నమ్మి మోసపోవద్దన్నారు. రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ రాజేశ్వర్ రావు మాట్లాడుతూ.. మరోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని క్రిస్టియన్లు ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రూరల్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



బాజిరెడ్డి గోవర్ధన్‌ను సన్మానిస్తున్న రూరల్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

## బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



జక్రాన్‌పల్లికి చెందిన కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

జక్రాన్‌పల్లి/ డిచ్‌పల్లి/ మోపాల్ (ఖలీల్‌వాడి), నవంబర్ 2 : జక్రాన్‌పల్లి మండలంలోని వివిధ గ్రామాల్లోని బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన యువజన సంఘం సభ్యులు 100 మంది ఎంపీటీసీ మరియా సతీశ్ ఆధ్వర్యంలో గురువారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. డిచ్‌పల్లి ఆర్‌ఎస్‌కు చెందిన 50 మంది కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారిని ఎమ్మెల్యే సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. మోపాల్ మండలంలోని కంజర గ్రామానికి చెందిన 25 మంది ముస్లిం మైనార్టీ కాంగ్రెస్ నాయకులు, యువకులు బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతు తెలుపుతూ బీఆర్‌ఎస్‌లో చేరారు. కంజర గ్రామానికి చెందిన ఖాజామొహీనుద్దీన్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరగా.. బాజిరెడ్డి గోవర్ధన్ వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

## ఆత్మీయ సమ్మేళనానికి తరలిన గౌడ కులస్తులు

జక్రాన్‌పల్లి/ నిజామాబాద్ రూరల్/ ఇందల్వాయి, నవంబర్ 2 : డిచ్‌పల్లి మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన గౌడ కులస్తుల ఆత్మీయ సమ్మేళనానికి రూరల్ నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాల నుంచి గౌడ కులస్తులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. బీఆర్‌ఎస్ రూరల్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా జక్రాన్‌పల్లి నుంచి బోనాలతో కార్యక్రమానికి బయల్దేరారు. మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్ పిలుపు మేరకు కొత్తపేట గ్రామానికి చెందిన గౌడ సంఘం సభ్యులు సంఘం మండల అధ్యక్షుడు పర్శాగౌడ్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. అంతకుముందు వారు రేణుకా మాత ఆలయంలో పూజలు చేశారు.

ఇందల్వాయి మండలంలోని వివిధ గ్రామాల నుంచి గౌడ సంఘం సభ్యులు ప్రత్యేక వాహనాల్లో సమ్మేళనానికి తరలివెళ్లారు.



జక్రాన్‌పల్లి నుంచి బోనాలతో ఆత్మీయ సమ్మేళనానికి తరలుతున్న గౌడ కులస్తులు



కొత్తపేట నుంచి ఆత్మీయ సమ్మేళనానికి తరలుతున్న గౌడ కులస్తులు

## ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



ధర్పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, డీసీవో

ధర్పల్లి, నవంబర్ 2 : మండలకేంద్రంలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ యాదిరెడ్డి.. డీసీవో సింహాచలంతో కలిసి గురువారం పరిశీలించారు. రైతులు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని పరిశీలించి సొసైటీ కార్యదర్శి సంతోష్‌రెడ్డితో వారు మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. అనంతరం మండలంలోని హొన్నాజీపేట సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్లు చెలిమెల చిన్నారెడ్డి, రాజేందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు అభినందన

డిచ్‌పల్లి, నవంబర్ 2 : మండలంలోని ధర్మారం(బీ) సాంఘిక సంక్షేమ పాఠశాలకు చెందిన విద్యార్థులు వి.యశస్వినీ, బి.వర్ష ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ అండర్-19 రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సంగీత తెలిపారు. ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు వరకు గజ్వేల్‌లోని బూరుగుపల్లిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ నీరజారెడ్డి, పీఈటీ జ్యోత్స్న, వైస్ ప్రిన్సిపాల్ కిషన్, ఉపాధ్యాయులు మమత, నూరున్నిసా పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో బాలికకు గాయాలు

డిచ్‌పల్లి, నవంబర్ 2 : మండలంలోని నడ్పల్లి తండాకు చెందిన రుషిక అనే రెండేండ్ల బాలికపై కుక్కలు గురువారం దాడి చేసి గాయపరిచాయని సర్పంచ్ ప్రమీల రాజేశ్ తెలిపారు. గ్రామంలో కొద్దిరోజులుగా కుక్కలు స్వైరవిహారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయన్నారు. కుక్కల దాడిలో గాయపడిన బాలికను నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

## రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభం

ధర్పల్లి, నవంబర్ 2 : మండలకేంద్రంలో రూ. 6.5 కోట్లతో చేపట్టనున్న రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులను గురువారం ప్రారంభించారు. రెండు నెలల క్రితం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఆర్అండ్‌బీ అధికారుల సమక్షంలో మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి చౌరస్తా నుంచి రోడ్డు విస్తరణ పనులను కాంట్రాక్టర్ ప్రారంభించారు. రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తయితే ధర్పల్లి గ్రామ రూపురేఖలు మారనున్నాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కళాశాలలో వ్యాసరచన పోటీలు

డిచ్‌పల్లి, నవంబర్ 2 : పవర్‌గ్రిడ్ సంస్థ ఆధ్వర్యంలో విజిలెన్స్ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అవినీతికి వ్యతిరేకంగా విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు డిచ్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు పవర్‌గ్రిడ్ డీజీఎం ప్రభాకర్, ప్రిన్సిపాల్ చంద్రవిఠల్ బహుమతులను ప్రదానం చేశారు.

## ఉద్యోగాలు సాధించిన యువకులకు సన్మానం



యువకులను సన్మానిస్తున్న సర్పంచ్ రమేశ్, నాయకులు

సిరికొండ, నవంబర్ 2 : మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన యువకులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించగా.. వారిని సర్పంచ్ పుడేళ్ల రమేశ్‌తో పాటు నాయకులు గురువారం సన్మానించారు. పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన కచ్చకాయల ప్రశాంత్, ఆకుల అరుణ్, నీరడి రాజ్‌కుమార్‌తోపాటు భారత నౌకాదళంలో ఉద్యోగం సాధించిన నితిన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుమన్, వీడీసీ అధ్యక్షుడు కిరణ్, సొసైటీ వైస్‌చైర్మన్ అబ్బాస్, రాంచందర్, రాజు, ప్రవీణ్, సంతోష్, రహీం, రవి పాల్గొన్నారు.